సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



ఆదర్శ గ్రామంగా చెక్కరాయి

చెక్కరాయిని ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని భీమిలి శ్రీ సద్గురు సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ పేర్కొన్నారు. 8లో



ముగ్గురిని కాపాడిన లైఫ్‌గార్డ్‌లు

విశాఖ నగరంలోని రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ముగ్గురు విద్యార్థులను లైఫ్‌గార్డులు రక్షించారు. 8లో



ఘనంగా శ్రావణలక్ష్మీ పూజలు

విశాఖ : శ్రావణమాసం సందర్భంగా కనక మహాలక్ష్మి దేవస్థానంలో ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి.

న్యూస్‌రీల్

సబ్‌కలెక్టర్లుగా ప్రకార్ జైన్, అపూర్వ భరత్

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ

సాక్షి, పాడేరు : పాడేరు సబ్ కలెక్టర్‌గా 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రకార్ జైన్ నియమితులయ్యారు. ఆయనకు పాడేరు ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఐటీడీఏ పీవో అభిషేక్‌కు చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యింది. గతంలో ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన ధాత్రిరెడ్డి ఏలూరు జిల్లా జేసీగా బదిలీ కావడం తెలిసిందే. ఎటపాక సబ్ కలెక్టర్‌గా 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అపూర్వ భరత్‌ను నియమించారు. ఆయనకు చింతూరు ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ దంపతులు



న్యాయమూర్తి జేకే మహేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు దినేష్‌కుమార్, విజయకృష్ణన్ దంపతులు

సాక్షి,పాడేరు: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జే.కే.మహేశ్వరిని అల్లూరి,అనకాపల్లి కలెక్టర్లు దినేష్‌కుమార్,విజయకృష్ణన్ దంపతులు శనివారం అరకులోయలో మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి వారు పుష్పగుచ్ఛం అందజేశారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి హెచ్చరిక
- అంగన్‌వాడీ ఆయాకు జీతం నిలిపివేతకు ఆదేశం



వంజంగి అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

పాడేరు రూరల్ (హుకుంపేట): అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి హెచ్చరించారు. శనివారం మండలంలోని వంజంగి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ ఆయా ఈ నెల 9వ తేదీ నుంచి విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహానికి గురయ్యారు. ఆమెకు జీతం నిలిపివేయాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు బాధ్యతగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రీస్కూల్ చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు.అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

దేవస్థానం ఈవోపై చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు డిమాండ్



మాట్లాడుతున్న బంగారు వెంకటేష్

ఎటపాక: ఆదివాసీలపై దాడికి పాల్పడిన భద్రాచలం దేవస్థానం ఈవోపై అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎటపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుషోత్తపట్నంలో దేవస్థాన భూములు ఆక్రమించిన వారిని ఖాళీ చేయించలేని ఈవో ఒక ఆదివాసీ మహిళ ఇంటిని కూల్చి కిరాయి రౌడీలతో దాడి చేయించారని పేర్కొన్నారు. దేవస్థాన భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోని ఇలాంటి అధికారులను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని, ఈవో వైఖరికి నిరసనగా ముంపు ప్రాంత ఆదివాసీలంతా ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

రోడ్లపైనే బజారు..
రైతు దిగాలు

విశాఖ మన్యం ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైన తరువాత అన్ని రంగాల్లో పాడేరు డివిజన్ అభివృద్ధి చెందుతున్నా రైతులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. జిల్లాకేంద్రమైన పాడేరులో కూరగాయలు అమ్ముకునేందుకు తగిన సౌకర్యాలు లేవు. ఇక్కడ ఏర్పాటుచేసిన గిరిజన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. దీంతో కొంతమంది రోడ్లపక్కన అమ్ముకోవాల్సిన దుస్థితి. మరికొంతమంది మైదాన, పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయించాల్సి వస్తోంది. ఇలా రైతులు ఒకపక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోపక్క కూరగాయలు లభ్యంకాక వినియోగదారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- స్థానికంగా మార్కెటింగ్ లేక గిరి రైతుల అవస్థలు
- కూరగాయ ఉత్పత్తులను విశాఖ తరలించేందుకు ఇబ్బందులు
- జిల్లా కేంద్రం పాడేరులో నిరుపయోగంగా గిరిజన రైతు బజార్
- సౌకర్యాలు కల్పించని అధికార యంత్రాంగం



పాడేరులో నిరుపయోగంగా ఉన్న గిరిజన రైతు బజార్ సముదాయం



పాడేరు పాతబస్టాండ్ ఆవరణలో రోడ్డు పక్కన వ్యవసాయ. ఉద్యానవన ఉత్పత్తుల అమ్మకాలు జరుపుతున్న గిరి రైతులు

సాక్షి, పాడేరు: జిల్లాలోని పాడేరు డివిజన్‌లో గిరిజన రైతులు కూరగాయలను సేంద్రియ విధానంలో పండించడం వల్ల మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అయినప్పటికీ వాటిని అమ్ముకునేందుకు స్థానికంగా మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మైదాన, పట్టణ ప్రాంతాలకు తరలించి అవస్థలకు గురవుతున్నారు. సమస్య పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

3,591ఎకరాల్లో సాగు..

పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో రబీలో 95 ఎకరాలు, ఖరీఫ్‌లో 3,591ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతులను పండిస్తున్నారు. వీరిలో ముంచంగిపుట్టు మండలం దోడిపుట్టు, డుంబ్రిగుడ మండలం సొవ్వ, కూచుమండ, అరకులోయ మండలంలో చినలబుడు, పెదలబుడు ప్రాంతాల రైతులు విశాఖలోని రైతుబజార్లకు తరలించి విక్రయిస్తున్నారు. జిల్లాల పునర్విభజన జరగక ముందు వీరికి అక్కడ ప్రత్యేకంగా ఉద్యానవనశాఖ దుకాణాలు కేటాయించింది. చింతపల్లి మండలంలో చౌడుపల్లి, గూడెంకొత్తవీధి మండలంలో రింతాడ పండించే కూరగాయలను నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వారపు సంతలకు తీసుకువచ్చిన కూరగాయల సైతం వ్యాపారులు కొనుగోలు చేసి పట్టణ ప్రాంతాలకు తీసుకువెళ్తున్నారు. కూరగాయల ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నప్పటికీ స్థానికంగా వినియోగదారులకు అందుబాటులో ఉండటం లేదు. విశాఖ మన్యం పాడేరు కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావడంతో వనరులు మెరుగుపడ్డాయి. కూరగాయల వినియోగం పెరిగింది.

15ఏళ్లుగా మూతపడి..

గిరి రైతుల కోసం సుమారు 15 ఏళ్ల క్రితం పాడేరులోని పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన రైతు బజార్ అలంకారప్రాయంగా మారింది. వినియోగంలోకి తెస్తామని అధికారుల ప్రకటన కేవలం ప్రచారానికే పరిమితమైంది. రైతుల ఉత్పత్తులతో కళకళలాడాల్సిన ఈ ప్రాంతం ఆటోస్టాండ్‌గా మారిపోయింది. జిల్లా కేంద్రమైన పాడేరు పరిసరాల్లో పండించే గిరి రైతులు వ్యవసాయ, ఉద్యానవన పంటల ఉత్పత్తులను ఇక్కడికి తీసుకువచ్చి నడిరోడ్డుపై అమ్ముకుంటున్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసినా..

పాడేరు డివిజన్‌లో 19 రైతు ఉత్పత్తి సంఘాలను ఉద్యానవనశాఖ ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో పాడేరు డివిజన్ పరిధిలో పండించే కూరగాయలను విశాఖలోని రైతు బజార్‌లకు తరలించకుండా పాడేరు రైతు బజార్‌లో విక్రయించేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. దీనివల్ల రైతులకు అవస్థలు తప్పడమే కాకుండా మెరుగైన ధర లభిస్తుందని, వినియోగదారులకు కూరగాయల కొరత తీరుతుందని పలువురు సూచిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు



పాడేరులో రైతుబజార్‌ను వినియోగంలోకి తెస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఈ విషయాన్ని గతంలో ఎన్నోసార్లు అధికారులకు విన్నవించాం. గతంలో పనిచేసిన కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు రైతుబజార్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు. తెచ్చిన కూరగాయలను అమ్ముకునేందుకు స్థలం లేక రోడ్డుపక్కన విక్రయించాల్సి వస్తోంది.

– శరభ కుమారి, రైతు,కించుమండ

ఐటీడీఏ నిధులతో అభివృద్ధి



పాడేరు పాతబస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న రైతుబజార్‌ను ఐటీడీఏ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేస్తాం. గిరిజనులు వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపక్క విక్రయించడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయి. గిరిజన రైతుబజార్‌లోనే వ్యాపార లావాదేవీలు కొనసాగించేలా వినియోగంలోకి తెస్తాం. దీని అభివృద్ధికి కమిటీ ఏర్పాటుచేస్తాం.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

కూరగాయల సాగు విస్తరిస్తాం



పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో కూరగాయల సాగు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు తమకు అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు,ఇతర పంటల విత్తనాలను ప్రైవేట్ మార్కెట్‌లో కొనుగోలు చేసుకుంటే మొత్తం ఖరీదులో 50శాతం నగదును ఉద్యానవనశాఖ చెల్లిస్తుంది. సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న మెట్టభూముల్లో సాగు చేపట్టవచ్చు.

– రమేష్‌కుమార్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి

వైద్య, ఆరోగ్య సిబ్బంది నిరసన



జిల్లా ఆస్పత్రి ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



సూపరింటెండెంట్ విశ్వామిత్రకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్ నరసింగరావు

- జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి దారుణం
- నిందితులను కఠినంగా శిక్షించాలి
- జిల్లావ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో ర్యాలీలు
- ఇబ్బందులు పడిన రోగులు

సాక్షి,పాడేరు: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య దారుణమని, హంతకులకు మరణశిక్ష విధించాలని వైద్యబృందాలు డిమాండ్ చేశాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రితో పాటు తల్లీపిల్లల వైద్యవిభాగంలో గంట పాటు ఓపీని నిలిపివేశారు. ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు.అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రకు సీనియర్ వైద్యులు డాక్టర్ తమర్బ నరసింగరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. భవిష్యతులో ఇలాంటి సంఘటనలు జరగకుండా మహిళా వైద్య ఉద్యోగులకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని, జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసిన నిందితులకు వెంటనే మరణశిక్ష విధించాలని వారు పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఆస్పత్రి నుంచి పాతబస్టాండ్ వరకు వైద్యబృందాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. రోడ్డుపై వైద్యులు కూర్చుని నిరసన తెలిపారు.

అరకు ఏరియా ఆస్పత్రిలో..

అరకులోయ రూరల్: స్థానిక వైద్యవిధాన పరిషత్ ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారులు, సిబ్బంది నిరసన తెలిపారు. కొంతసేపు ఓపీ నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర వైద్యసేవలకోసం రోగులు పడిగాపులు పడ్డారు.

ఎల్‌బ్రస్‌ను అధిరోహించిన తెలుగుతేజం

- సాయితేజకు అభినందనల వెల్లువ
- గతంలో సీలేరులో నివాసం
- తండ్రి శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న స్థానికులు



ఎల్‌బ్రస్‌ను అధిరోహించిన సాయితేజ్

సాక్షి,పాడేరు: యూరప్ దేశాల్లో అత్యంత ఎత్తయిన మౌంట్ ఎల్‌బ్రస్‌ను శుక్రవారం తెలంగాణలోని హైదరాబాద్ జిల్లా బడంగ్‌పేట వాసి సాయితేజ అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేయడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో సాయితేజ తండ్రి మలసాల శ్రీనివాసరావు సీలేరులో నివాసం ఉండేవారు. ఇప్పుడు ఆయన కుటుంబంతో తెలంగాణలో ఉంటున్నారు. వివిధ మాధ్యమాల ద్వారా సాయితేజ సాధించిన ఘనతను తెలుసుకున్న సీలేరు పరిసర ప్రాంతీయుల్లో ఆనందం నెలకొంది. వారంతా సాయితేజను అభినందిస్తున్నారు. చిన్నతనం నుంచి పర్వతారోహణపై ఆసక్తి ఉన్న సాయితేజ 13,500 అడుగుల ఎత్తులో ఉన్న అతిపెద్ద మంచు పర్వతాన్ని అనేక ఆవరోధాల మధ్య అధిరోహించాడు. బూట్స్ అండ్ క్రోమ్‌వన్ ఆర్గనైజేషన్ సంస్థ తరఫున పర్వతారోహణకు వెళ్లి ఆరు రోజుల వ్యవధిలోనే ఈ ఘనత సాధించి జాతీయ జెండాను ఆవిష్కరించి చరిత్ర సృష్టించాడు. చిన్నతనంలోనే ఎన్‌సీసీలో చేరిన సాయితేజ సాహస పోటీల్లో సత్తా చాటేవాడని ఆ కుటుంబంతో పరిచయం ఉన్న సీలేరు ప్రాంతీయులు తెలిపారు. వారంతా అతని తండ్రి శ్రీనివాసరావుకు ఫోన్‌లో అభినందనలు తెలుపుతున్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



అనంతగిరి బాలికల ఆశ్రమ పాఠశాలలలో చేతులెత్తి కమిటీని ఎన్నుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



హుకుంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎన్నికలను పర్యవేక్షిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

- చేతులెత్తే విధానంలో నిర్వహణ
- 1401 పాఠశాలల్లో ఏకగ్రీవం
- 1498 చోట్ల పోటీ
- 43 బడుల్లో వాయిదా

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో కమిటీలను ఎన్నుకున్నారు. చేతులెత్తే విధానంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో ఒకటి నుంచి టెన్త్ వరకు అన్ని యాజమాన్యాలకు సంబంధించి 2,942 పాఠశాలలు ఉండగా, వీటిలో 2,899 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. తల్లిదండ్రులు 50శాతం మేరకు హాజరు కానున్నందున 30 పాఠశాలలు, విద్యార్థులు కనీసం లేకపోవడంతో 13 పాఠశాలల్లో ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. మిగిలిన వాటిలో 1401 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, 1498 పాఠశాలల్లో ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లావిద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు హుకుంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను పర్యవేక్షించారు.

కాకరపాడు బీట్‌లో స్క్వాడ్ డీఎఫ్‌వో పర్యటన

కొయ్యూరు: మండలంలోని పెదవలస రేంజ్ కొయ్యూరు సెక్షన్ కాకరపాడు బీట్‌ను స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందర్ శనివారం పరిశీలించారు. అటవీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సోలాబు ప్రాంతంలో టేకు చెట్లకు రక్షణ కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. స్థానికులతో మాట్లాడారు. రేంజర్ శివరజని,అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



హాజరైన అధికారులు

రంపచోడవరం: ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ సూచించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో బాల్య వివాహాల చట్టంపై ప్రజలకు, గ్రామ సచివాలయంలోని మహిళా పోలీసులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సీడీపీవో సంధ్యారాణి, సీఐ రవికుమార్, సూపర్‌వైజర్లు కుసుమకుమారి పాల్గొన్నారు.

పినరావెలి ఘాట్ రోడ్డులో జీపు బోల్తా


- 12 మందికి గాయాలు
- క్షతగాత్రులకు రూడకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స
- తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు: మండలంలోని మారుమూల జామిగుడ పంచాయతీ పినరావెలి ఘాట్ రోడ్డులో ప్రయాణికులతో వస్తున్న జీపు అదుపు తప్పి బోల్తా పడింది. శనివారం జరిగిన ఈ ఘటనలో 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ముంచంగిపుట్టులో వారపు సంతకు వెళ్లి జామిగుడ గ్రామానికి తిరిగి వస్తుండగా జామిగుడ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పినరావెలి గ్రామ సమీపంలోని ఘాట్ దిగుతుండగా ఈ ప్రమాదం చేసుకుంది. బ్రేక్ ఫెయిల్ కావడంతో జీపు అదుపుతప్పి బోల్తా కొట్టిందని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో జామిగుడ పంచాయతీకి చెందిన పాంగి ఆనందరావు, కొర్ర శ్రీదేవి, మఠం మాణిక్యం, వంతాల చంద్రకళ, పాంగి నందిని, పాంగి మల్లేశ్వరరావు, కొర్ర బంగారయ్య, కొర్ర లుక్కి, పాంగి లలిత, పాంగి రమేష్, పి.కామరాజు, రవి కిశోర్ గాయపడ్డారు. వీరిలో ఎనిమిదేళ్ల నందినికి తల, ఇతర భాగాల్లో, కొర్ర బంగారయ్యకు, కె.శ్రీదేవికి కాళ్లు, చేతులు, తల భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానికులు అందించిన సమాచారం మేరకు అంబులెన్సుతో రూడకోట పీహెచ్‌సీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే అక్కడి నుంచి పీహెచ్‌సీకి తరలించి సత్వర వైద్యం అందించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిమితికి మించి ప్రయాణికులు ఉన్నందున ఘాట్ మార్గంలో జీపు అదుపుతప్పిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఈ ఘటన నాలుగు అడుగుల ముందు జరిగి ఉంటే పెద్ద లోయలోకి బోల్తా కొట్టి ఉండేదని వారు వివరించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

చింతపల్లిలో ముంచెత్తిన వాన



చెరువును తలపిస్తున్న పంట పొలాలు



పెద్ద పైపు వద్ద ఉధృతంగా ప్రవాహం

లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం

చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లిలో కుండపోత వర్షానికి పంట పొలాలు జలమయమయ్యాయి. శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఏకధాటిగా కురిసింది. రహదారులు నీట మునిగాయి. కొండగెడ్డల ప్రవాహానికి పెద్దపైపు నిండుగా ప్రవహించింది. దీంతో చింతపల్లి మెయిన్ రోడ్డుకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతర్ల గ్రామానికి సుమారు గంటసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలు నీటమునిగాయి.



పాడేరు ప్రాంతంలో శనివారం ఉదయం కారుమబ్బులు కనువిందు చేశాయి. నీలం రంగు ఆకాశంలో నల్లటి మబ్బులు చూపరులను ఆకట్టుకున్నాయి. – సాక్షి, పాడేరు

క్లుప్తంగా

ముగ్గురిని కాపాడిన లైఫ్‌గార్డ్‌లు

కొమ్మాది (విశాఖ): రుషికొండ బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోతుండగా లైఫ్ గార్డ్స్ ప్రాణాలు కాపాడారు. నగరానికి చెందిన బి. దీపక్, ఎస్.నితిన్, ఎస్.కౌషిక్ శనివారం మధ్యాహ్నం సరదాగా గడిపేందుకు బీచ్‌కొచ్చారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరు కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ సూరాడ సూకరాజు, డి.కార్తిక్, ఎమ్. అమ్మోరు గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. విద్యార్థులకు మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏవో రాబిన్ సుదర్శన్

ఎటపాక: వరిలో పురుగుల నివారణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఎటపాక మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ అన్నారు. మండలంలోని చింతలగూడెంలో శనివారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలను కాపాడుకునే విధానం, చెట్ల ఆకులు, ఆవుపేడ, ఆవుమూత్రం ద్వారా కషాయాల తయారీ ద్వారా తెగుళ్లు, కీటకాల నివారణ గురించి రైతులకు వివరించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



తీర్థబిందెని తీసుకొస్తున్న అర్చకులు, చిత్రంలో ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగులకు, వైదికులకు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి హెచ్చరించారు. ఉదయం స్వామికి జరిగే సుప్రభాతసేవలోను, తీర్థబిందె పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన వారు వచ్చారో లేదో పరిశీలన జరిపారు. ఒక డోలు విద్వాంసుడు గైర్హాజరు కావడాన్ని గమనించారు. ఉదయం త్రిపురాంతక స్వామి ఆలయం తెరవకపోవడాన్ని గమనించారు. దీంతో ఇరువురుకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఏఈవో ఆనంద్‌కుమార్‌ని ఆదేశించారు. కాగా చందనోత్సవం తర్వాత నిలిచిపోయిన తీర్థబిందె సంప్రదాయాన్ని శనివారం నుంచి పునరుద్ధరించారు. ఏటా చందనోత్సవం తర్వాత మూడునెలలపాటు తీర్థబిందెని తీసుకొచ్చే సంప్రదాయాన్ని నిలిపివేసి ఆ తర్వాత పునరుద్ధరిస్తారు.

ముగిసిన స్కూల్ కమిటీ ఎన్నికలు



కొయ్యూరులో ప్రతిజ్ఞ చేస్తున్న కమిటీ సభ్యులు



లక్కొండలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిటీ సభ్యులు

పాఠశాలలకు తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు

అరకులోయ టౌన్: జిల్లా వ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత , గిరిజన ఆశ్రమ, కేజీబీవీ, ఏకలవ్య తదితర పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకుని కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు, ప్రిన్సిపాళ్లు తదితరులు మాట్లాడుతూ యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధి, పిల్లల విద్య ప్రగతికి తోడ్పాటు కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు తమ పరిధిలో విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అరకులోయ మండలంలోని 148 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. గన్నెల పంచాయతీ బోడిబెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అనివార్య కారణాలవల్ల ఎస్ఎంసీ ఎన్నిక జరగలేనట్టు ఎంఈవో–2 ప్రధాని భారతిరత్నం తెలిపారు.

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలలో ప్రిన్సిపాల్ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా వంతాల కామేశ్వరావు, బోయకృష్ణతో పాటు అయిదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎంఈవో సుందరరావు కమిటీకి పలు సూచనలిచ్చారు. హెచ్ఎం కృష్ణారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ భవానీ తదితరులు పాల్గొన్నారు.







జి.మాడుగుల ఎస్ఎంసీ చైర్మన్ నీలందొర, వైస్ చైర్మన్ విజయకుమారి, చింతూరు ఎస్ఎంసీ చైర్మన్ జల్లి నరేష్

పెదబయలు: మండలంలోని 192 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు జరిగినట్టు ఎంఈవో కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని ప్రా థమిక పాఠశాలలో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ, యూపీ పాఠశాలల్లో 8 మంది కమిటీ, ఆశ్రమ పాఠశాలల్లో 16 మంది సభ్యులతో పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక జరిగినట్టు చెప్పారు. హెచ్ఎంలు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని 150 పాఠశాలల్లో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో రాంబాబు తెలిపారు. మూడు పాఠశాలల్లో జరగలేదు. కొయ్యూరు గురుకుల పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్‌గా మొట్టడం వలసయ్యదొర, ప్రభుత్వోన్నత పాఠశాల చైర్మన్‌గా మాకాడ సరస్వతి ఎన్నికయ్యారు. ఎటువంటి వివాదాలు జరగకుండా ముందస్తుగా పోలీసుభద్రత కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మోహన్, మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో గురుకులం పాఠశాలలో జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో ఎస్ఎంసీ చైర్మన్‌గా లొంబోరి నీలందొర, వైస్ చైర్మన్‌గా విజయకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేజీబీవీలో కమిటీ చైర్మన్‌గా కారం శ్రీరామయ్య, వైస్ చైర్మన్‌గా భద్రమ్మ, సుర్మతి ఆశ్రమ పాఠశాలలో చైర్మన్‌గా తల్లే తిరుపతమ్మ, సుర్మతి ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా వనభంగి రాములమ్మ, వాకపల్లి ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా ప్రభాస్ ఎన్నికయ్యారు. గాదిగుంట ఎంపీపీ పాఠశాల చైర్మన్‌గా వంతాల సోమరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో 204 పాఠశాలలకు గాను 150 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని, 54 పాఠశాలల్లో ఓటింగ్ పద్ధతిపై ఎన్నిక జరిగినట్టు ఎంఈవో సిహెచ్ బాబూరావుపడాల్ తెలిపారు.



దుంబ్రిగుడలో కమిటీ ప్రతినిధులతో ప్రమాణం చేయిస్తున్న ఏకలవ్య ప్రిన్సిపాల్ సన్యాసినాయుడు

చింతూరు: మండలంలోని పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 106 పాఠశాలలుండగా అన్ని పాఠశాలల్లోనూ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా జల్లి నరేష్ ఎంపికయ్యారు.

వీఆర్ పురం : మండలంలో 51 పాఠశాలలుండగా 50 పాఠశాలల్లో శనివారం విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. వడ్డిగూడెం ఎంపీయూపీఎస్ పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా పడినట్లు ఆయన తెలిపారు.

ఎటపాకలో: మండలంలో 91 పాఠశాలలుండగా 87 పాఠశాలల్లో శనివారం విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో రాజులు తెలిపారు. నాలుగు పాఠశాలల్లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడినట్టు ఆయన చెప్పారు.

గంగవరం : మండలంలోని 61 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికల ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో టి.మల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు.



అరకులోయలో కమిటీ చైర్మన్ తదితరులతో హెచ్ఎం మోహన్‌రావు



ముసిడిపుట్టులోని ఎస్ఎంసీ ఎన్నికలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ సతీష్

హుకుంపేట: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ సతీష్ చెప్పారు. మండల కేంద్రంలోని వారపు సంతలో శనివారం జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీస్ మాట్లాడుతూవారపు సంతల్లో ట్రాఫిక్ అధికంగా ఉంటుందని, ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. పార్కింగ్ స్థలంలోనే వాహనాలను నిలుపుదల చేయాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దన్నారు.

కంచరపాలెం పాలిటెక్నిక్‌కు ప్రతిష్టాత్మక పథకం

మురళీనగర్ : కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఏఐసీటీఈ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు కార్యక్రమం నిర్వహణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎంపికైంది. రాష్ట్రంలోని 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి దరఖాస్తులు రాగా కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సమర్పించిన నివేదికను పరిగణలోకి తీసుకుని ఈ కళాశాలను ఎంపిక చేసింది. 2024–2025 విద్యా సంవత్సరానికి శిక్షణ తరగతులు ఇక్కడ నిర్వహించనున్నారు. తరగతుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనుమతి లభించిందని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు. సోమవారం నుంచి 24వ తేదీ వరకు మొదటి విడత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనే అధ్యాపక సిబ్బందికి ఉత్పత్తుల్లో నాణ్యత నిర్వహణ, లాజిస్టిక్ ఆప్టిమైజేషన్ అమలుతో సహా నాణ్యత నిర్వహణ సూత్రాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారన్నారు. విద్యారంగ నిపుణులు, పరిశ్రమలకు చెందిన వివిధ విభాగాల నిపుణులు పాల్గొని వారం రోజులు మొదటి బ్యాచ్‌కు చెందిన 50 మంది ఫ్యాకల్టీలకు శిక్షణనిస్తారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, మెకానికల్ హెడ్ కె.మధుకుమార్, తులసీరామ్ ఇతర ఫ్యాకల్టీ సభ్యులు బ్రోచర్‌ను ఆవిష్కరించారు

అంధకారంలో చినఉరుము

- గ్రామంలో పాడైన ట్రాన్స్‌ఫార్మర్
- పదిరోజులుగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- స్థానికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

జి.మాడుగుల: జి.మాడుగుల పంచాయతీ చినఉరుము గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో సుమారు పది రోజులుగా విద్యుత్ సరఫరా లేదని, గ్రామం అంధకారంలో ఉందని స్థానికులు చెప్పారు. అటవీ ప్రాంతం కావడంతో రాత్రిళ్లు అడవి జంతువులు, విష సర్పాల భయం వెంటాడుతోందని, విద్యుత్ సరఫరా లేకపోవడంతో బిక్కుబిక్కుమని భయంతో గడుపుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. గ్రామానికి తక్షణమే విద్యుత్ సరఫరా చేయాలని సీపీఎం నాయకులు లక్ష్మణ్, గ్రామస్తులతో కలిసి శనివారం పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలియజేశారు.



చినుఉరుములో పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆదర్శ గ్రామంగా చెక్కరాయి

జి.మాడుగుల: మండలంలోని చెక్కరాయి ఆదివాసీ గ్రామం అభివృద్ధికి భీమిలి సద్గురు సేవాశ్రమం, గాంధీనగర్ శ్రీహనుమ సేవాశ్రమ ప్రతినిధి సాయిరాం స్వామిజీ (యోగరాజు)దత్తత తీసుకున్నారు. మండలంలో జి.మాడుగుల పంచాయతీ చెక్కరాయి గ్రామాల్లో శనివారం 14 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కుర్చీలు, ఇనుప మంచాలు,పరుపులు, ట్రంక్ పెట్టెలు,నూతన దుస్తులు తదితర సామగ్రిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మద్యం, సారా సేవించమని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని ఇద్దరు ఆదివాసీ గిరిజనులతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రజల్లో దైవభక్తి పెంపొందించేందుకు త్వరలోనే ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వెనుకబడి ఉన్న గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చెక్కరాయి గ్రామంలో సేవా కార్యక్రమాలు విస్తరించి, విద్యార్థులకు అవసరమైన కిట్లు పంపిణీ చేస్తామన్నారు. చెక్కరాయిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. సమరసత సేవా కమిటీ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు మాట్లాడుతూ సాయిరాం స్వామీజీ విశాఖ జిల్లా సద్గురు సేవాశ్రమం ద్వారా, జి.మాడుగుల గాంధీ నగర్ శ్రీ హనుమ సేవాశ్రమం ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. అంతేకాకుండా చాలా గ్రామాలకు ఆంజనేయ స్వామి, సాయిబాబా విగ్రహాలు, శివపార్వతుల విగ్రహాలను ఆయన అందజేశారన్నారు. గాంధీనగర్‌లో రూ.70లక్షలతో శ్రీహనుమ ఆలయ నిర్మాణం చేపట్టారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాపిటిరాజు, పంతులరాజు, భీమశంకర్, శ్రీవిజయ సాయి ఆలయ ప్రతినిధి కిముడు వెంకటరమణ, భక్త సంఘ ప్రతినిధులు శ్రీను, సన్యాసిరావు పాల్గొన్నారు.



గిరిజనులకు నిత్యావసర సరకులు, ట్రంక్ పెట్టెలను పంపిణీ చేస్తున్న స్వామిజీ

విశాఖ రేంజ్ పరిధిలో
52 మంది సీఐలకు బదిలీలు

- వీరిలో వీఆర్‌కు 17 మంది సీఐలు
- వీఆర్‌లో ఉన్న 10 మంది సీఐలకు పోస్టింగ్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో 52 మంది ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. ఇందులో వీఆర్‌కు 17 మంది వెళ్లగా..వీఆర్‌లో ఉన్న 10 మంది సీఐలకు పోస్టింగ్ కల్పించారు. ఈ మేరకు శనివారం డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లాలో జీకే వీధి సీఐగా పనిచేసే బి.అప్పలనాయుడును పార్వతీపురం సాలూరుకు, సాలూరు టౌన్ సీఐ చింటా వాసునాయుడును అల్లూరి జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్సు సీఐగా, వీఆర్‌లో ఉన్న హెచ్.మల్లేశ్వరరావును అల్లూరి జిల్లా డీసీఆర్‌బీ సీఐగా, అదేవిధంగా వీఆర్‌లో ఉన్న బి.అప్పలనాయుడును అల్లూరి ఎస్‌బీ సీఐగా, అక్కడ పనిచేసే హిమగిరిని అరకు సీఐగా బదిలీ చేశారు.

అనకాపల్లి జిల్లాలో.. అనకాపల్లి జిల్లాలో పనిచేసే 17 మంది సీఐలను రేంజ్ పరిధిలో వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. వివిధ జిల్లాల నుంచి అనకాపల్లి జిల్లాకు 13 మంది సీఐలను బదిలీ చేశారు. విశాఖ రేంజ్ పరిధిలో వివిధ జిల్లాల నుంచి అనకాపల్లి జిల్లాకు..కశింకోట సీఐగా అల్లు స్వామినాయుడు, అనకాపల్లి ఎస్‌బీ సీఐగా కె.లక్ష్మణమూర్తి, అనకాపల్లి ట్రాఫిక్ సీఐగా ఎం.వెంకట నారాయణ, అనకాపల్లి ఉమెన్స్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఆర్.వి.వి.ఎస్.ఎస్.సీ.హెచ్ శేఖర్‌రావు బదిలీపై వచ్చారు. అనకాపల్లి జిల్లాలో పనిచేసిన రాంబిల్లి సీఐ ఎస్.లక్ష్మణరావును వీఆర్‌కు, నక్కపల్లి సీఐ విజయ కుమార్‌ను శ్రీకాకుళం టెక్కలికు, సైబర్ సెల్ సీఐ కుమార్ స్వామిను నక్కపల్లికు, కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడును వీఆర్‌కు, అనకాపల్లి రూరల్ సీఐ ఎస్.ధనుంజయ్ రావును యలమంచిలికు, యలమంచిలిలో పనిచేసే సీఐ గఫూర్‌ను వీఆర్‌కు, పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజును చోడవరంకు, చోడవరం సీఐ బమ్మిడి శ్రీనివాసరావును వీఆర్‌కు, అనకాపల్లి టాస్క్‌ఫోర్సు సీఐ చంద్ర శేఖర్‌ను వీఆర్‌కు, కశింకోట సీఐ వినోద్ బాబును వీఆర్‌కు, అనకాపల్లి ఎస్‌బీ సీఐ అప్పలనాయుడును అనకాపల్లి సీసీఎస్‌కు, అక్కడ సీసీఎస్ సీఐ నీలయ్యను వీఆర్‌కు, అనకాపల్లి టౌన్ సీఐ జి.శంకర్‌రావును విజయనగరంకు, నర్సీపట్నం రూరల్ సీఐ హరిని పార్వతీపురం మన్యం జిల్లాకు, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పైడపునాయుడును వీఆర్‌కు బదిలీ చేశారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పూండి–నౌపడ–పూండి, తిలారు–కొటబొమ్మాళి సెక్షన్‌ల పరిధిలో జరుగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఈనెల 22, 24వ తేదీల్లో ఆలస్యంగా బయల్దేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 21న పుదుచ్చేరిలో రాత్రి 6.50 గంటలకు బయల్దేరాల్సిన పుదుచ్చేరి–భువనేశ్వర్(12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా రాత్రి 9.35 గంటలకు బయల్దేరుతుంది. ఈ నెల 21, 23వ తేదీల్లో కేఎస్ఆర్ బెంగళూరులో మధ్యాహ్నం 1.40 గంటలకు బయల్దేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు–భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 4.10గంటలకు బయల్దేరుతుంది.